సాక్షి అనంతపురం

మంగళవారం । 14 । జనవరి । 2025



ఈ బిల్లులు తగలెయ్యా

విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు సోమవారం భోగి మంటల్లో బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. 8లో



విద్యాసంస్థల్లో ప్రగతి మదింపు

ఉన్నత విద్యా సంస్థల్లో నాణ్యత ప్రమాణాల మదింపునకు కార్యాచరణ మొదలైంది. ఈ మేరకు యూజీసీ నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. 8లో



జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్ కుమార్ చౌదరి

అనంతపురం: తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్ కుమార్ చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రోహిత్ కుమార్ చౌదరి ప్రస్తుతం గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా ఉన్నారు. కాగా, తాడిపత్రికి 2014లో ట్రైనీ ఐపీఎస్‌ను డీఎస్పీగా పంపారు. తాజాగా పూర్తిస్థాయిలో ఏఎస్పీని కేటాయించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తాడిపత్రిలో అంతులేని విధంగా సాగుతున్న అరాచకాలను కట్టడి చేయాలనే ఉద్దేశంతోనే ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

సామాన్యుడిపై జులుం ప్రదర్శించడం అన్యాయం

- దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- డీఎస్పీకి మేయర్ వసీం ఫిర్యాదు



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

అనంతపురం సెంట్రల్: అనంతపురంలో ఓ సామాన్యుడిపై జులుం ప్రదర్శించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం డిమాండ్ చేశారు. ఆర్టీఓ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంతియాజ్ అహ్మద్‌పై దాడిని ఖండిస్తూ సోమవారం నగర డీఎస్పీ శ్రీనివాస్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అకారణంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై ఓ కానిస్టేబుల్, హోంగార్డులు దాడికి పాల్పడిందే కాకుండా బాధితునిపై కేసు నమోదు చేయడం బాధాకరమన్నారు. ఘటనకు సంబంధించి వీడియోలను డీఎస్పీకి చూపించారు. ఇటీవల కాలంలో పోలీసుల తీరు ఆక్షేపణీయంగా ఉందని, స్టేషన్‌లోనే అనుమానాస్పదంగా న్యాయవాది మృతి చెందడం, టవర్‌క్లాక్ వద్ద యువకుడిని బూటు కాళ్లతో తన్నిన ఘటనలు మరువకముందే బహిరంగంగా సామాన్యుడిని చితకబాదడం అన్యాయమన్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి ఇలాంటి పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ రిజ్వాన్, కార్పొరేటర్లు రహంతుల్లా, కమల్‌భూషన్, నాయకులు ఖాజా, దాదు, కాకర్ల శీనా తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడికాయలను కొనే వారు లేక అనంతపురం నడిమి వంక వద్ద మహిళా వ్యాపారి నిరుత్సాహం



కొనుగోలుదారుల కోసం అనంతపురం టవర్‌క్లాక్ వద్ద ఎదురుచూస్తున్న పూల వ్యాపారులు



అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామంలో కానరాని పండుగ సందడి



రేగుకాయలు కొనే వారు లేక బండిని తోసుకెళ్తున్న మహిళ

కళ నింపని.. పండుగ..!

గ్రామాలు కళ తప్పాయి. సంక్రాంతికి సందడిగా ఉండాల్సిన వీధులు మూగబోయాయి. పండుగ సరుకులు కొనేవారు లేక చిరువ్యాపారులకు నిరాశే మిగిలింది. ఎంతో ఆశతో పూలు, గుమ్మడికాయలు, ఇతర పండుగ సామగ్రిని అనంతపురానికి తీసుకొచ్చిన వ్యాపారులు, రైతులు దీనంగా వెనుదిరగాల్సి వచ్చింది. రూ. 25 వేల పెట్టుబడి పెట్టి పూల సాగు చేశామని, కొనుగోలు చేసే వారే లేక భయం పట్టుకుందని పాతూరుకు చెందిన అలివేలమ్మ వాపోయారు. ఇక.. గ్రామాల్లో ఎవరిని కదిపినా 'దబ్బుల్లేవప్పా... ఇంక పండగ యాడ చేసేది'' అంటూ నిట్టూరుస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

సర్కారుకే సంక్రాంతి కిక్కు

- మెగా సేల్‌కు రంగం సిద్ధం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫుల్ స్టాకు ఉంచాలని నిర్ణయం
- గడిచిన మూడున్నర నెలల్లో రూ.450 కోట్ల అమ్మకాలు
- 53.25 లక్షల లీటర్ల మద్యం వినియోగం
- 16.48 లక్షల లీటర్ల బీరు తాగేసిన మద్యంప్రియులు
- రోజుకు 45,147 లీటర్ల చొప్పున లిక్కర్ వినియోగం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మెగాసేల్ అనగానే బట్టల షాపుల్లో, మొబైల్ షాపుల్లో అమ్మకాలు అనుకుంటే పొరపాటు పడ్డట్టే. సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని మద్యం ప్రియులకు భారీ స్థాయిలో కిక్కు ఎక్కించేందుకు 'మెగాసేల్'కు కూటమి సర్కారు కసరత్తు చేస్తోంది. పండుగ మూడు రోజులూ మద్యం షాపుల నిండా స్టాకు పూర్తి స్థాయిలో ఉండేలా ఎక్సైజ్ విభాగం చర్యలు తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 230 షాపులకు అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంచే విధంగా పంపిణీ ఏర్పాట్లు చేశారు. భారీ స్థాయిలో అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం సంక్రాంతికి మరింతగా పరుగులు పెట్టనుంది.

నాలుగు నెలల్లో రూ.450 కోట్లు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉన్నాయి. 2024 సెప్టెంబర్ 16 నుంచి కొత్త మద్యం పాలసీ వచ్చింది. అప్పటినుంచి 2025 జనవరి 13 వరకూ ఈ రెండు జిల్లాల్లోనే రూ.450 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు తేలింది. మరో 28 బార్లలో జరిగిన అమ్మకాలు దీనికి అదనం. మద్యం షాపుల ఓనర్లు అనంతపురం, రాప్తాడు లాంటి చోట్ల ఉదయం 7 గంటలకే షాపులు తెరుస్తున్నారు. రాత్రి 11 గంటల వరకూ కొనసాగుతున్నాయి. వీటిని పట్టించుకునే నాథులు కరువయ్యారు. అసలు ఎక్సైజ్ డిపార్ట్‌మెంటు జిల్లాలో ఉందా లేదా అన్న అనుమానం కలుగుతోంది. ఓవైపు లిక్కర్ తాగి నేరాలకు పాల్పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మరోవైపు అమ్మకాలు మరింతగా పెంచుతున్నారు. బహిరంగంగా మద్యం తాగినా, ధాబాలు, హోటళ్లలో తాగినా ఎవరికీ పట్టడం లేదు.

బెల్టు.. పర్మిట్‌ల జోలికి వెళ్లొద్దు!

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పర్మిట్ రూములు, బెల్టు షాపులు అనధికారికంగా విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఎక్కడో ఒకచోట తూతూ మంత్రంగా ఎక్సైజ్ విభాగం దాడులు నిర్వహించి మమ అనిపిస్తోంది. మొన్నటికి మొన్న డిసెంబర్ 31, జనవరి 1వ తేదీన రెండు రోజులు రూ.21 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్టు తేలింది. ఏ ఒక్క పర్మిట్ రూమ్‌ను కానీ, బెల్టుషాపులను కానీ ఎక్సైజ్ విభాగం చూసిన పాపాన పోలేదు. సంక్రాంతికి మూడు రోజులు కూడా ఎలాంటి దాడులు జరగకుండా చూసేందుకు ఎక్సైజ్ శాఖ మద్యం షాపుల ఓనర్లతో మాట్లాడుకున్నట్టు తెలిసింది. పైగా అనంతపురంలో ఎక్కువ అమ్మకాలు ఉంటాయి. ఇక్కడ ఎమ్మెల్యేనే ఎనిమిదికి పైగా షాపులు నడిపిస్తున్నారు. అన్ని చోట్లా అనధికార పర్మిట్ రూములు నడుస్తున్నాయి. కానీ ఆ షాపుల వైపు చూడటానికి కూడా ఎక్సైజ్ అధికారులు భయపడుతున్నారు. కనుమ పండుగ పూర్తయ్యే వరకూ పర్మిట్ రూములు, బెల్టుషాపుల వైపు ఎవరూ కన్నెత్తి చూసే పరిస్థితి లేదు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గడిచిన నాలుగు నెలల్లో మద్యం అమ్మకాలు

అనంతపురం జిల్లాలో మద్యం వినియోగం	33,30,000 లీటర్లు
అనంతపురం జిల్లాలో బీర్ల వినియోగం	10,56,808 లీటర్లు
అనంతపురం జిల్లాలో మద్యం, బీర్ల విలువ	రూ.280,69,45,390
శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం వినియోగం	20,55,308 లీటర్లు
శ్రీ సత్యసాయి జిల్లాలో బీర్ల వినియోగం	23,89,968 లీటర్లు
శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం, బీర్ల విలువ	రూ.162,73,56,667

డీలర్‌షిప్ దక్కకుండా చేశాడని అరటి చెట్లు నరికేశారు

- ఐదుగురిని అరెస్టు చేసిన యల్లనూరు పోలీసులు



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ సత్యబాబు

యల్లనూరు: డీలర్‌షిప్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు దక్కకుండా చేశాడనే కక్షతో అరటి చెట్లు నరికేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. వివరాలను సోమవారం యల్లనూరు పీఎస్‌లో సీఐ సత్యబాబు వెల్లడించారు. మండలంలోని బొప్పేపల్లి గ్రామ సమీపంలో రైతు సుదర్శననాయుడు సాగు చేసిన అరటి తోటలో ఇటీవల 1,052 చెట్లను నరికివేసిన విషయం తెలిసిందే. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు దర్యాప్తు వేగవంతం చేశారు. పక్కా ఆధారాలతో కుమ్మనమల గ్రామానికి చెందిన మనోహర్, సరేంద్ర, చిన్నపెద్దిరాజు, సురేష్, పెద్దరాజును సోమవారం నారాయణరెడ్డి పల్లి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నేరం బయటపడింది. తమకు దక్కాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్, స్టోర్ డీలర్‌షిప్‌ను సుదర్శన నాయుడు అడ్డుకున్నాడనే కక్షతో ఆయన ఆర్థిక మూలాలపై దెబ్బతీసినట్లు అంగీకరించారు. దీంతో ఐదుగురిని అరెస్ట్ చేసి, చెట్ల నరికివేతకు ఉపయోగించిన కొడవండ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి



పుట్లూరు వద్ద దానిమ్మ తోటను పరిశీలిస్తున్న ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి, చిత్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

బుక్కరాయసముద్రం: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ముస్సోరి ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ (లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్) డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి సూచించారు. సోమవారం స్థానిక గాంధీనగర్ సచివాలయం-4తో పాటు పోలీస్ స్టేషన్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను అనవసరంగా తిప్పుకోకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్, సీఐ కరుణాకర్, ఈఓఆర్డీ సదాశివం తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పర్యటన

పుట్లూరు/తాడిపత్రి అర్బన్: పుట్లూరు మండలంలోని ఏ.కొండాపురం గ్రామంలో సోమవారం దానిమ్మ, చామంతి సాగును ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ డైరెక్టర్ శ్రీరామ్ తరిణికంటి పరిశీలించారు. దానిమ్మ సాగుపై రైతులతో ఆరా తీశారు. పెట్టుబడి, దిగుబడులతో పాటు కూలీల ఖర్చు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

- తాడిపత్రిలో ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి పర్యటించారు. మున్సిపాలిటీ కార్యాలయాన్ని పరిశీలించారు. విద్యుత్‌ను ఆదా చేయడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిన తాడిపత్రి మున్సిపాలిటీని అన్ని మున్సిపాలిటీలు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బుగ్గ రామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాలను ఆయన సందర్శించారు. ఆలయంలోని శిల్పకళను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు.
- చుక్కలూరులో నిర్వహిస్తున్న సిద్ధార్థ కోల్డ్ స్టోరేజీని శ్రీరామ్ తరణికంటి పరిశీలించారు. కోల్డ్ స్టోరేజీ సామర్థ్యం, వినియోగం తదితర వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, ఏపీఎంఐపీ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ రజాక్‌వలి, ఎంఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువు.. అవస్థల దరువు

- శింగనమల చెరువులో తూములను ఎత్తడానికి తీవ్ర ఇబ్బందులు
- పంటల సాగు సమయంలో అన్నదాతలకు తప్పని ఇక్కట్లు
- ప్రతిపాదనలకే పరిమితమైన షట్టర్ల ఏర్పాటు



శింగనమల చెరువులో తూములు ఎత్తుతున్న రైతులు

శింగనమల: ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద చెరువుగా పేరుగాంచిన శింగనమల రంగరాయుల చెరువు కింద పంటలు పెట్టే సమయంలో కాలువలకు నీరు వదులుకోవాలంటే ఆయకట్టు రైతులకు నరకం కనిపిస్తోంది. చెరువులోని తూములకు షట్టర్లు లేకపోవడంతో వాటిని కట్టెలతో ఎత్తుకోవాల్సి వస్తోంది. ప్రపంచ బ్యాంక్ నిధులు మంజూరైనా షట్టర్ల ఏర్పాటు కార్యరూపం దాల్చకపోవడంతో అన్నదాతల అవస్థలు చెప్పనలవిగా ఉంటున్నాయి.

ఈతగాళ్లు కరువై...

చెరువులో ఏళ్ల క్రితం ఒక ఇనుప రాడ్ ఏర్పాటు చేసి దాని కింద భాగంలో మొద్దు ఉంచారు. రైతులు నీటిలో ఈదుకుంటూ వెళ్లి తూముల పైకి ఎక్కి రాడ్‌ను పైకి లాగాక నీరు బయటకు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. కొన్ని సార్లు రాడ్‌కు ఉన్న మొద్దు జారితే నీరు పారకుండా నిలిచిపోతున్నాయి. ఈ క్రమంలో రైతులు గజ ఈతగాళ్లను రప్పిస్తున్నారు. వారు నీటిలో 10 అడుగుల లోతుకు వెళ్లి మొద్దుకు రాడ్‌ను తగిలించాకే నీరు యథావిధిగా ప్రవహిస్తున్నాయి. అయితే, ఇటీవల గజ ఈతగాళ్లు కరువైపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే దొరుకుతున్నారని, భవిష్యత్తులో సమస్య తలెత్తితే ఏం చేయాలో పాలుపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాంగ్‌వేర్ నిర్మించి, తూములకు షట్టర్లు ఏర్పాటు చేస్తే అవస్థలు తప్పుతాయని చెబుతున్నారు.

నిధులు మంజూరైనా..

రంగరాయుల చెరువులో మరమ్మతుల కోసం 2018–19లో ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.4.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. చెరువు 4 తూములకు గ్యాంగ్‌వేర్ నిర్మించి, షట్టర్లు ఏర్పాటు చేయాలని అప్పట్లో ప్రతిపాదనలు చేశారు. చెరువు కట్టపై 3 మీటర్ల వెడల్పుతో మట్టి వేయించడం, చెరువు కొత్త మరువలో మరమ్మతులు చేయాలని కూడా ప్రతిపాదించారు. అయితే, కేవలం కాలువలపై అక్కడక్కడా చిన్న బ్రిడ్జిలు నిర్మించి, చెరువు కట్ట ముందు సైడ్‌వాల్ కట్టి చేతులెత్తేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దాదాపు 5 వేల ఎకరాల్లో పంటలు..



రంగరాయుల చెరువు కింద అధికారికంగా దాదాపు 2,800 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. శింగనమల, గోవిందరాయునిపేట, సోదనపల్లి, మట్లగొంది, ఈస్ట్ నరసాపురం, శివపురం, సీ.బండమీదపల్లి, చక్రాయిపేట, పోతురాజుకాల్వ, పెరవలి గ్రామాల పరిధిలో మరో 2,000 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. చెరువు నుంచి నీరు బయటకు ప్రవహించడానికి నాలుగు తూములు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నీరు ఆయకట్టుకు పారుతున్నాయి.

షట్టర్లు ఏర్పాటు చేయాలి

పంటలు పెట్టే సమయంలో కాలువలకు నీరు వదులుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉంటోంది. తూములకు ఏర్పాటు చేసిన రాడ్‌లు పైకి లేవకపోతే నీరు బయటకు రావు. మొద్దు జారిపోతే రెండు రోజుల పాటు శ్రమించాలి. నీటిలో మునిగి పనిచేయాలి. తూములకు షట్టర్లు ఏర్పాటు చేస్తే అవస్థలు తప్పుతాయి.
– తిరుపతయ్య, రైతు, శివపురం

నీరు తగ్గిన వెంటనే చర్యలు

శింగనమల చెరువులో నీరు తగ్గిన వెంటనే తూముల మరమ్మతు పనులు చేపడతాం. చెరువు అభివృద్ధికి గతంలో ప్రపంచ బ్యాంక్ నిధులు విడుదలయ్యాయి. త్వరలోనే తగిన చర్యలు చేపట్టి అవస్థలు లేకుండా చూస్తాం.
– రాజ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ

క్లుప్తంగా

మౌనగిరి క్షేత్రాన్ని సందర్శించిన హైకోర్టు అదనపు జడ్జి



ఆలయాన్ని సందర్శించిన న్యాయమూర్తి చల్లా గుణరంజన్

రాప్తాడు: మండలంలోని హంపాపురం సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన మౌనగిరి క్షేత్రాన్ని సోమవారం ఏపీ హైకోర్టు అదనపు జడ్జి చల్లా గుణరంజన్, జిల్లా జడ్జి శ్రీనివాస్, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గురుప్రసాద్ సందర్శించారు. క్షేత్ర వ్యవస్థాపకుడు ఈశ్వరయ్యస్వామి పూర్ణ కుంభంతో వారిని సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను వివరించారు. స్వామి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉద్యోగస్తుల ఐక్యతే లక్ష్యంగా క్రికెట్ టోర్నీ : మచ్చా



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

అనంతపురం: ఉద్యోగస్తుల ఐక్యతే లక్ష్యంగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి అన్నారు. ఉద్యోగుల క్రికెట్ ఆరో రౌండ్ పోటీలను అనంతపురంలోని ఆర్డీటీఆ మైదానంలో సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో విద్య, వైద్య, క్రీడా రంగాల అభివృద్ధికి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చేసిన సేవలకు గుర్తుగా ఆయన పేరుతో టోర్నీని నిర్వహిస్తుండడం గర్వంగా ఉందన్నారు. అనంతరం రాయదుర్గం ఆర్టీసీ, లాయర్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. కార్యక్రమంలో విజయరాజు, రఘు, శంకర్, నాయక్, లాయర్ జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం ముఖద్వారం వద్ద అందంగా అలంకరించిన రథంపై సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయం వరకూ రథాన్ని లాగారు. ఉత్సవంలో దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కు.ని.కి పాట్లు



- ఇటీవల అనంతపురం నగరంలో నిహారిక అనే చిన్నారి ఉదయం స్కూలుకు వెళుతుండగా కుక్కల గుంపు దాడి చేసింది. ఘటనలో చిన్నారి తీవ్రంగా గాయపడడంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు.
- గుత్తిలో ఉదయం మార్కెట్‌కు వెళ్లి వస్తుండగా వీధికుక్కలు తీవ్రంగా దాడిచేసి గాయపరిచాయి. దీంతో వారం రోజులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. ఇప్పటికీ ఆ మహిళ ఏఆర్‌వీ వ్యాక్సిన్ వాడుతోంది.

- కుక్కల కుటుంబ నియంత్రణలో ఘోర వైఫల్యం
- మున్సిపాలిటీల పరిధిలో శునకాల స్వైర విహారం
- కుని శస్త్రచికిత్సల్లో అనంతపురం జిల్లా అట్టడుగున
- శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఇదే పరిస్థితి
- కుక్కల 'కు.ని.' పేరుతో నిధులు పక్కదారి
- శునకాల భయంతో వణుకుతున్న కాలనీల వాసులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యంత విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీధికుక్కల స్వైర విహారంతో కాలనీలకు కాలనీలే వణుకుతున్నాయి. ఏ వీధికి వెళ్లినా గుంపులు గుంపులుగా వస్తున్న కుక్కలతో మహిళలు, చిన్నారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళుతున్న పరిస్థితి నెలకొంది. గడిచిన ఏడు మాసాల్లో అనంతపురం జిల్లాలో 2,700 కుక్కకాటు కేసులు నమోదు కాగా, శ్రీసత్యసాయి జిల్లాలో 2,400కు పైగా నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అంచనా వేయచ్చు.

మున్సిపాలిటీల్లో కుక్కల స్వైరవిహారం..

అనంతపురం జిల్లాలో 6, శ్రీసత్యసాయి జిల్లాలో 6 మున్సిపాలిటీలు ఉన్నాయి. మొత్తం 12 మున్సిపాలిటీల్లో కుక్కల సంఖ్య గత నాలుగేళ్లతో పోలిస్తే 22 శాతం పెరిగినట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కుక్కలకు స్టెరిలైజేషన్ (సంతానోత్పత్తి నియంత్రణ) లేకపోవడం వల్ల వాటి సంఖ్య భారీగా పెరిగిందనేది వాస్తవం. దీంతో కుక్క కాటు కేసులు ఎక్కడా లేనంతగా పెరిగాయి. సగటున రోజూ ఒక్కో మున్సిపాలిటీలో ఐదు నుంచి ఆరు కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. సగటున ఒక్కో జిల్లాలో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువైన యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వినియోగమవుతోంది. మున్సిపల్ అధికారులు మాత్రం స్టెరిలైజేషన్ పేరిట నిధులు దుర్వినియోగం చేయడం తప్ప కుక్కల నియంత్రణ చేసిన దాఖలాలు లేవు.

48 నెలల్లో ఎప్పుడైనా వ్యాపించవచ్చు

కుక్క కరిస్తే వచ్చే రేబిస్ వ్యాక్సిన్ 14 రోజుల నుంచి 48 నెలల వరకూ ఎప్పుడైనా వ్యాపించవచ్చు. ఈ కారణంగానే చాలామంది చిన్న గాటు కూడా పడలేదని తేలిగ్గా తీసుకుంటున్నారు. కానీ రేబిస్‌కు కారణమయ్యే వైరస్ అత్యంత ప్రమాదకారి. నెమ్మదిగా వ్యాపిస్తుంది. కుక్క కరచిన గాటు తలకు దగ్గరగా ఉన్నట్టైతే అంటే...భుజానికి గానీ, మెడకు గానీ, వీపుపై గానీ ఇలా ఏదైనా తలకు సమీపంలో ఉంటే అత్యంత వేగంగా రేబిస్ వ్యాధి వ్యాపిస్తుంది.

ఈ కుక్కలతో జాగ్రత్త

- కుక్కల నోటినుంచి చొంగ కారడం, నాలుక బయటపెట్టడం, మతిలేకుండా తిరగడం, కనపడిన వస్తువులను, పశువులను కరవడం వంటి కారణాలు కనిపిస్తే అది పిచ్చి కుక్కగా పరిగణించవచ్చు
- ఇలాంటి కుక్కలు కరచిన వెంటనే 30 నిముషాల లోపు ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి
- రేబిస్ వ్యాధి అనేది సంక్రమిత వ్యాధి. ఒకరికి సోకితే కుటుంబ సభ్యులకు, ఇరుగు పొరుగు వారికి కూడా సోకే అవకాశం ఉంటుంది
- కుక్క కరచిన రోజు నుంచి ఏఆర్‌వీ వేయించుకోవాలి. కరచిన రోజు, 3వ రోజు, 7వ రోజు, 14వ రోజు, 28వ రోజు, 90వ రోజున యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి
- గాయం బాగా పెద్దగా ఉంటే రేబిస్ ఇమ్యునోగ్లోబిలిన్ యాంటీ సీరంలను వేయాలి.
- రేబిస్ వ్యాక్సిన్ ప్రభుత్వాసుపత్రుల్లో లభిస్తుంది. అక్కడ లభించలేదంటే ఒక్కో డోసు రూ.600 నుంచి రూ.700 వరకూ అవుతుంది

కుక్క కరిస్తే ప్రాథమిక చికిత్స ఇలా

- కుక్క కరవగానే ఆ ప్రాంతాన్ని శుభ్రంగా కొళాయి కింద కడగాలి
- సబ్బు నీటితో కడగడం వలన వైరస్ లక్షణాలను వీలైనంత ఎక్కువగా నిర్మూలించవచ్చు
- అయొడిన్, డెట్టాల్ వంటి మందులను గాయంపై వేయడం మంచిది
- కుక్కకాటు గాయానికి కుట్లు వేయడం గానీ, ఆయింట్‌మెంట్‌లు పూయడం కానీ చేయకూడదు.
- బకెట్‌లో ఉంచి కడిగితే కుక్క నోటినుంచి వచ్చిన సొంగ మరో పుండుమీద గానీ, ఇతర కారణాల వలన వేరే గాయానికి అంటుకున్నా వ్యాధి సోకే అవకాశం ఉంటుంది

అనంతపురం జిల్లాలో	
ఈ ఏడాది కు.ని.లక్ష్యం	9,589
ఇప్పటివరకూ చేసింది	445
ఇంకా చేయాల్సింది	9,144
కుక్కకాటు కేసులు	2,700కు పైగా

శ్రీసత్యసాయి జిల్లాలో	
ఈ ఏడాది కు.ని.లక్ష్యం	5,601
ఇప్పటివరకూ చేసింది	722
ఇంకా చేయాల్సింది	4,879
కుక్కకాటు కేసులు	2,451

ఈ బిల్లులు తగలెయ్యా!

- భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం
- ప్రజావ్యతిరేక పాలనకు అద్దం పట్టిన నిరసన కార్యక్రమాలు



గుంతకల్లులో భోగి మంటల్లో కరెంటు బిల్లులు వేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై ప్రజల్లో రోజురోజుకూ అసహనం పెరిగిపోతోంది. విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా సోమవారం భోగి మంటల్లో కరెంటు బిల్లులు దహనం చేసిన ఘటనలే ఇందుకు నిదర్శనం. అనంతపురంలోని టవర్ క్లాక్ వద్ద సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి విద్యుత్ బిల్లులు దహనం చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి పెద్దలు నెరవేర్చకపోగా... సర్దుబాటు పేరుతో రూ.15వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమని నిరసించారు. స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలంటూ పాదయాత్రలో లోకేష్ పిలుపునిచ్చారన్నారు. ఇప్పుడు వారి ప్రభుత్వమే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోందని మండిపడ్డారు. ప్రజావ్యతిరేక పాలన ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రజల ఆగ్రహాన్ని ప్రత్యక్షంగా చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతపురం టవర్‌క్లాక్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, కమిటీ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, ఆర్‌వీనాయుడు, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో విద్యుత్ బిల్లుల దహనం



అనంతపురంలో టవర్ క్లాక్ వద్ద విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

- **గుంతకల్లుటౌన్:** నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు డి.శ్రీనివాసులు, నాగరాజు, రమేష్, సురేంద్ర, షబ్బీర్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- **రాయదుర్గం టౌన్:** రాయదుర్గంలోని శాంతినగర్‌లో ప్రజలు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున, నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, ఆంజనేయులు, రమేష, తిప్పేస్వామి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, సిద్దలింగ, ఎర్రిస్వామి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

గుంతకల్లు రూరల్: స్థానిక రూరల్ పీఎస్ పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న చోరీ కేసుల్లో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కసాపురం పీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్‌ఐ వెంకటస్వామితో కలసి సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఇటీవల గుంతకల్లులోని వీవీనగర్‌లో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కొని వెళ్లారు. అలాగే జగ్జీవన్‌రామ్ కాలనీలోనూ చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఈ రెండు చోరీలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో సోమవారం గుంతకల్లులోని భగత్‌సింగ్ నగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయం వెనక సోమవారం అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో చోరీలకు పాల్పడుతున్నది తామేనని అంగీకరించారు. పట్టుబడిన వారిలో గుత్తిలోని మారుతీ నగర్‌కు చెందిన మోతే రాజేష్, సుందరయ్య కాలనీకి చెందిన మాల ప్రవీణ్ కుమార్ ఉన్నారు. వీరి నుంచి 3.5 తులాల బంగారు నగలు, రూ.60 వేల నగదు, గుత్తిలో అపహరించిన 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపుతున్న పోలీసులు

డ్రెయినేజీ కుంటలో పడిన కార్మికురాలు

తాడిపత్రి టౌన్: స్థానిక మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికురాలు ప్రమీల ప్రమాదవశాత్తు డ్రెయినేజీ కుంటలో పడి తీవ్ర అస్వస్థతకు లోనైంది. విధి నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం యాజీడీ ఎస్టీబీ–2 వద్ద మురుగు నీటి శుద్ధి పనుల్లో నిమగ్నమైన ఆమె... అదుపు తప్పి డ్రెయినేజీ కుంటలో పడింది. సకాలంలో తోటి కార్మికులు గుర్తించి ఆమెను వెలికి తీసి, వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్, హనుమంతరెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏఈ తేజా వ్యవహరిస్తూ మురుగునీటి శుద్ధి పనులను కార్మికులతో చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు కేటాయించిన పనులు మాత్రమే చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రమీలను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

విద్యాసంస్థల్లో ప్రగతి మదింపు చర్యలు

- నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యత ఇచ్చేలా యూజీసీ మార్గదర్శకాలు
- రెండు దశల్లో వర్సిటీలు, కాలేజీల నాణ్యత అంచనా
- జాతీయ విద్యా విధానం అమలు చేస్తున్న విద్యాసంస్థలకు ప్రాధాన్యత

అనంతపురం: ఉన్నత విద్యా సంస్థల్లో నాణ్యత ప్రమాణాల మదింపునకు కార్యాచరణ మొదలైంది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. వర్సిటీలు, కళాశాలల్లో నాణ్యతను ధ్రువీకరిస్తూ ఇచ్చే న్యాక్ అక్రిడిటేషన్‌లో అదనపు ఫ్రేమ్‌వర్క్‌ను పరిచయం చేయనున్నారు. మొత్తం ఈ ప్రక్రియలో రెండు దశల్లో విద్యా సంస్థల మదింపు చేసి ర్యాంకులు ఇవ్వనున్నారు. జాతీయ విద్యా విధానం అమలుకు అధిక ప్రాధాన్యతనిచ్చేలా మార్గదర్శకాలు ఉండడం విశేషం.

30 రోజుల్లో నివేదిక ఇవ్వాలి..

తొలి దశ 'ఎలిజిబులిటీ క్వాలిఫైయర్'లో ప్రాథమిక అర్హతలను పరిశీలిస్తారు. ఇందులో ఎంపికైన విద్యా సంస్థలు రెండో దశ పరిశీలనకు అర్హత సాధిస్తాయి. తొలి దశలో విద్యా సంస్థ 11 రకాల అంశాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. వీటిలో యూజీసీ గుర్తింపు, న్యాక్ అక్రిడిటేషన్, ఏఐఎస్‌హెచ్‌ఈ పోర్టల్ రిజిస్ట్రేషన్, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీ, అంతర్గత ఫిర్యాదుల కమిటీ, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ రిజిస్ట్రేషన్ తదితర అంశాలను ప్రాథమికంగా పాటించాల్సి ఉంటుంది. ఇవన్నీ ఉంటే రెండో దశకు అర్హత లభిస్తుంది. రెండో దశలో నాణ్యత ధ్రువీకరణ కోసం నిర్ణీత ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. విద్యా సంస్థలోని కనీసం 75 శాతం బోధనా పోస్టుల్లో శాశ్వత సిబ్బంది ఉండాలి. ఈ శాశ్వత సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొంది ఉండాలి. అలాగే ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ , పర్యావరణ విద్యను ఆయా సంస్థలు బోధిస్తూ ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంత మంది విద్యార్థులు చేర్చుకున్నారు? ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాకింగ్ ఉందా? తదితర ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 49 ప్రశ్నలకు గాను 30 ప్రశ్నలు అన్ని ఉన్నత విద్యా సంస్థలకూ వర్తిస్తాయి. మరో 13 ప్రశ్నలు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాలు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు చెందినవి ఉంటాయి. ముఖ్యంగా వైస్‌చాన్సలర్ నియామకం యూజీసీ నిబంధనలకు అనుగుణంగా ఉందా? లేదో పరిశీలించనున్నారు. ఈ తాజా మార్గదర్శకాలపై 30 రోజుల్లోగా అభిప్రాయాలు తెలియజేయాలని యూజీసీ కోరింది.

ఉత్తమ పరిశోధనలకు ఉన్నత పురస్కారాలు

విద్యా రంగంలో ఉత్తమ పరిశోధనలను ప్రోత్సహించి, నాణ్యతను పెంపొందించేందుకు యూజీసీ ఉన్నత స్థాయి అవార్డులను ప్రవేశపెడుతోంది. 10 ఉత్తమ పీహెచ్‌డీ పరిశోధనలు అందించిన వారిని 'పీహెచ్‌డీ ఎక్స్‌లెన్స్ సైటేషన్'తో సత్కరించనుంది. నూతన జాతీయ విద్యా విధానం లక్ష్యాల్లో భాగంగా ఏటా వివిధ విభాగాల్లో అత్యుత్తమమైన పది పీహెచ్‌డీ థీసిస్‌లకు ఈ అవార్డు అందిస్తుంది. ఏటా జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పొందిన రీసెర్చ్ స్కాలర్లు తదుపరి ఏడాదిలో 'సైటేషన్' అవార్డుకు అర్హులవుతారని పేర్కొంది. ఇందుకోసం ప్రతి వర్సిటీలోనూ స్క్రీనింగ్ కమిటీని నియమిస్తోంది. ఈ కమిటీ వర్సిటీల నుంచి ఏటా ఐదు థీసిస్‌లను నామినేట్ చేస్తుంది. ఆగస్టు 1న విజేతలను ప్రకటిస్తారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం రోజు 'పీహెచ్‌డీ ఎక్స్‌లెన్స్ సైటేషన్'తో విజేతలను యూజీసీ సత్కరిస్తుంది.

అంతర్జాతీయ చెస్ టోర్నీలో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న పృథ్వీరాజ్‌గౌడ్

గుంతకల్లు: భారతీయ నవీన క్రీడా ఉత్సవ్‌లో భాగంగా ఈ నెల 10న విజయవాడ వేదికగా జరిగిన అంతర్జాతీయ ఫిడ్ చెస్ టోర్నీ ఓపెన్ కేటగిరిలో గుంతకల్లుకు చెందిన పృథ్వీరాజ్ గౌడ్ ప్రతిభ చాటి 13వ స్థానంలో నిలిచాడు. అనంతపురంలోని హెచ్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో ఏఈఈగా పనిచేస్తున్న పృథ్వీరాజ్... టోర్నీలో 7/9 పాయింట్లు సాధించి బహుమతిని కైవసం చేసుకున్నారు.

యువకుడి బలవన్మరణం



వీర ఓబుళప్ప

కంబదూరు: తన చదువుకు తగిన ఉద్యోగం కోసం సాగించిన అన్వేషణలో విసిగి వేసారిన ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన తిప్పేస్వామి, తిప్పమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో రెండో కుమారుడు వీర ఓబుళప్ప (26) ఐటీఐ వరకు చదువుకున్నాడు. ఈ క్రమంలో కదిరిదేవరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో ఆపరేటర్‌గా విధుల్లో చేరాడు. తన చదువుకు తగిన ఉద్యోగం కోసం అన్వేషణ మొదలు పెట్టాడు. అయినా ఫలితం దక్కలేదు. అంతేకాక జీతం కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెందిన ఓబుళప్ప ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పామిడిలో దొంగల హల్‌చల్

పామిడి: స్థానిక గుండప్పరావు కాలనీలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు హల్‌చల్ చేశారు. కాలనీలో నివాసమున్న టీచర్ గోవిందరెడ్డి సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి ఊరెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు ఆదివారం అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఎదురింటి వ్యక్తి గమనించి సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకుంటున్న పోలీసులను గమనించి దుండగులు ఉడాయించారు. కాగా, గత ఏడాది ఇదే సమయంలో టీచర్ గోవిందరెడ్డి ఇంటితో పాటు అదే ప్రాంతంలో ఉన్న కోళ్ల రాముడు ఇంటిలో దుండగులు చొరబడి విలువైన వస్తువులు అపహరించుకెళ్లిన సంగతి తెలిసిందే.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య



పెద్దన్న (ఫైల్)

నల్లమాడ: భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు...నల్లమాడ మండలం ఆర్.రామాపురం గ్రామానికి చెందిన పెద్దన్న (40), రాధమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మూడు రోజుల క్రితం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో రాధమ్మ అలిగి అదే గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. రోజులు గడుస్తున్నా భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన పెద్దన్న సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఇనుప కొక్కికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాబా



బాబా సలాం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన షేక్ బాబా సలాం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. తనపై పార్టీ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలు నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా బాబా సలాం పేర్కొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వలస కూలీ అనుమానాస్పద మృతి

కుందుర్పి: బతుకు తెరువు కోసం కర్ణాటక ప్రాంతానికి వలస వెళ్లిన వ్యక్తి అక్కడే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం వడ్డెపాళ్యం గ్రామానికి చెందిన బైరన్న (54) రెండు నెలల క్రితం బతుకు తెరువు కోసం కర్ణాటకలోని గౌరీబిదనూరుకు వలస వెళ్లి అక్కడే తమ గ్రామానికి చెందిన మేస్త్రీ తిమ్మరాజు వద్ద కూలీగా పనిలో చేరాడు. సోమవారం వేకువజామున బైరన్న భార్య లక్ష్మీదేవికి మేస్త్రీ తిమ్మరాజు ఫోన్ చేసి బైరన్నకు సీరియస్‌గా ఉందని తెలిపాడు. ఉదయం మళ్లీ ఫోన్ చేసి మృతదేహాన్ని తీసుకువచ్చినట్లు తెలిపి అప్పగించి వెళ్లాడు. అయితే మృతికి సంబంధించి కర్ణాటకలో కేసు నమోదు కాకపోవడంతో తిమ్మరాజు ప్రవర్తనపై అనుమానాస్పదంగా ఉండడంతో కుందుర్పి పోలీసులకు లక్ష్మీదేవి, కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు... బైరన్న మృతదేహాన్ని కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నగేష్ తెలిపారు.

గిల్టు నగల అపహరణ

పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని మంగాపురంలో నివాసముంటున్న ఉమాపతినాయక్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రోల్డ్‌గోల్డ్ నగలతో పాటు కొన్ని డాక్యుమెంట్‌లను ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆస్తి వివాదాల కారణంగా ఉమాపతినాయక్ కుటుంబం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలకు మేయర్ వసీం సోమవారం ఓ ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నగాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

చర్చి పరిచారకుల నియామకం



నూతనంగా నియమితులైన పరిచారకులు

అనంతపురం కల్చరల్: క్రైస్తవ సంఘం కార్యకలాపాలు, బైబిల్ వాఖ్యానాలను బలోపేతం చేయడం కోసం పరిచారకులను నియమించినట్లు కోర్టు రోడ్డులోని గాస్పెల్ అసెంబ్లీ ప్రార్థనా మందిరం సంఘం కాపారి బ్రదర్ టీపీ వరప్రసాద రెడ్డి తెలిపారు. సోమవారం గాస్పెల్ అసెంబ్లీ సంఘ పెద్దలైన బ్రదర్ దేవవరం, నోవా నవీన్, ఆదినారాయణ, ఆసాఫ్ హెరాల్డ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. బ్రదర్ రూబెన్, బ్రదర్ శాంతరాజు, బ్రదర్ శివయ్య, బ్రదర్ జేవీ రవికుమార్‌ను డికెన్సులు (పరిచాచరకులు)గా నియమించినట్లు వెల్లడించారు. అంతకుముందు ప్రార్థనా మందిరంలో వాక్యోపదేశం చేసిన రెవరెండ్ వరప్రసాద రెడ్డి దేవుడి క్రియలను ఘనపరడానికి విశ్వాసులు సిద్ధం కావాలన్నారు.

నేడు ముగ్గుల పోటీలు



గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయం వద్ద ముగ్గులు వేసేందుకు ఏర్పాట్లు చేసిన దృశ్యం

రాప్తాడు: చిన్మయ నగర్‌లోని గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజుల తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రెనాటి కొండా రెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి మహనంది రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ ముగ్గుల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ముగ్గు పిండి, రంగులు వారే తెచ్చుకోవాలన్నారు.

అనంతలో నాగసాధువులు



తపోవనం జగదీశ్వరాలయం వద్ద నాగసాధువులు

అనంతపురం కల్చరల్: ప్రతిష్టాత్మకంగా సాగనున్న కుంభమేళాకు హిమాలయాల నుంచి తరలి వెళ్తున్న నాగసాధువులు మార్గమధ్యంలో అనేక శైవక్షేత్రాలను సందర్శిస్తున్నారు. సోమవారం తపోవనంలోని జగదీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాగసాధువుల బృందం నాయకుడు దిగంబర స్వామి మాట్లాడుతూ.. సనాతన భారతీయ ధర్మాన్ని కాపాడటంలో కుంభమేళాలు ముందుంటాయన్నారు. ఈసారి ప్రతిష్టాత్మకంగా గంగా సంగమ క్షేత్రంలో ఘనంగా జరగనుందన్నారు. లక్షలాది మంది నాగసాధువులు, అఘోరాలు తరలి వస్తారని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలు భాగస్వాములు కావాలన్నదే తమ పర్యటన లక్ష్యమన్నారు. అంతకు ముందు జగదీశ్వరుడికి స్వయంగా విభూధితో అభిషేకం చేశారు. అనంతరం పలువురు భక్తులను ఆశీర్వదించారు.

విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గం



రాప్తాడు: విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో కాల్చుతున్న సీపీఎం నాయకులు



అనంతపురం అర్బన్: విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేస్తున్న మహిళలు

రాప్తాడు: విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే బిల్లులు పెంచారు. వెంటనే పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించాలని సీపీఎం రాప్తాడు రూరల్ ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం పిలుపు మేరకు రాప్తాడులో సీపీఎం పార్టీ, అనంతపురం రూరల్ ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో కాల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని, ఇంకా తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు సీఎం అయిన తర్వాత 7 నెలలు కూడా తిరగకుండానే విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. ఇష్టం వచ్చినట్లు విద్యుత్ చార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం.. గత ప్రభుత్వంపై వేయడం సిగ్గుచేటన్నారు. ఎప్పుడో వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు చార్జీలు చెల్లించడం అనే విధానాన్ని సీపీఎం పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ విధానంలో అసలు చార్జీల కంటే గత చార్జీలే ఎక్కువగా ఉండటం ప్రభుత్వ మోసపూరిత విధానానికి నిదర్శనమన్నారు. ప్రజల కష్టాన్ని దోచి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.15 వేల కోట్ల మేర భారాన్ని మోపి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా భోగి పండుగ రోజు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను కాల్చుతున్నామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు లక్ష్మన్న, ప్రకాష్, శేషు, మధు, పోతులయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న రైతులు

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

అనంతపురం అర్బన్: 'విద్యుత్ చార్జీలు పెంచబోము సరి కదా తగ్గిస్తామని ఎన్నికల్లో మాట్లాడిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తరువాత తన సహజ తీరుతో హామీని తుంగలో తొక్కారు. ప్రజలపై వేల కోట్లు రూపాయలు విద్యుత్ భారం మోపడం దుర్మార్గం.' అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. ఇందుకు కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లో మునిసిపల్ కార్మికులు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ.. ఎన్నికల్లో చెప్పిన మాటను తప్పి పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం తక్షణం తగ్గించాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వం నినాదం అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పి-4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమం అని చెబుతున్నారని మండిపడ్డారు. పేదరికం గురించి మాట్లాడటం తమ అధికారం కోసం పాలకవర్గాలకు శాశ్వత రాజకీయ నినాదం అయ్యిందన్నారు. ఏటీఎం నాగరాజు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి, నాయకురాళ్లు ఈశ్వరమ్మ, నారాయణమ్మ, రామలక్ష్మి, భవిత, సుజాత, భార్గవి, గిరిజన సమాఖ్య నాయకులు రామాంజనేయులు, ఓబులేసు, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలంటూ రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి





వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని నాగన్న, యాక్టివిటీ కార్యదర్శి గురుశేఖర్ బాబు, తదితరులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కమిటీలో చోటు దక్కించుకున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని నాగన్న, యాక్టివిటీ కార్యదర్శి గురుశేఖర్ బాబు సోమవారం వేర్వేరుగా అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు అలివిగాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి, అనుబంధ సంఘాల అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు సిద్ధే గంగాధర్ రెడ్డి, వెంకటరాముడు, లక్ష్మీనారాయణ రెడ్డి, సీపీ గౌడ్, కె.నాగిరెడ్డి, పార్టీ నాయకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

23న కనకదాస జయంత్యుత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కురుబ సంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ఈనెల 23న మదనపల్లిలో నిర్వహించే భక్త కనకదాస జయంత్యుత్సవం, రాష్ట్ర కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏపీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జయంత్యుత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. భక్త కనకదాస జయంతిని అధికారికంగా ఈనెల 23న మదనపల్లి రాంతులపీ కళ్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే కురుబ సంఘం జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా కురుబలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కర్ణాటక, ఆంధ్ర నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో చిరుతల విఠల్ గౌడ్, వశికేరి లింగమూర్తి, కాటమయ్య, వశికేరి శివ, వశికేరి రమేష్,సోమశేఖర్, కాశి విశ్వనాథ్, రాగే గోపాల్, రామాంజినేయులు, గుడే శ్రీనివాసులు, అనిల్‌కుమార్ తదిలరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై అవగాహన

అనంతపురం: భారతీయ వాతావరణ పరిశోధన విభాగం ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్కేయూ క్యాంపస్‌లోని వాతావరణ కేంద్రం పైలెట్ బెలూన్ అబ్జర్వేటరీ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సోమవాంర స్ఫూర్తి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులకు ఎస్కేయూ క్యాంపస్‌లోని అనంతపురం వాతావరణ కేంద్రంలో గ్లోబల్ వార్మింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, అంశాల మీద ఉపన్యాసం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వాతావరణ శాఖ అధికారులు నిఖిలేశ్వర్ గౌడ్, వెంకట మాధురి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా భోగి

రాప్తాడు/ఆత్మకూరు: ఆత్మకూరు, రాప్తాడు మండలాల వ్యాప్తంగా సోమవారం భోగి పండుగను జరుపుకున్నారు. మహిళలు తెల్లవారుజామునే లేచి తమ ఇళ్ల ముందు లోగిళ్లల్లో రంగు రంగుల రంగవల్లులు వేశారు. అందులో గొబ్బెమ్మలు పెట్టి, పసుపు, కుంకుమ పూశారు. వాటికి తంగేడు, గుమ్మడి, చామంతి పూలతో పాటు ఇతర పూలు పెట్టి పూజలు చేశారు.



రాప్తాడులో ముగ్గు వేస్తున్న మహిళలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సెవెన్ హిల్స్ కాలనీలో సోమవారం ఉదయం భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో ఈఈ సూర్యనారాయణ, కాలనీ వాసులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులను అనంతపురం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం పట్టణంలోని బీఆర్‌కే సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్–2024 విజయవాడలో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో వజ్రకరూరు మండలం కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అండర్–19 బాలికల విభాగంలో నందిని పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించారన్నారు. అలాగే గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లవణ్‌కుమార్ అండర్–19 బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో సాధించారు. వీరు ఈనెల 22న బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. వారిని ఆయనతోపాటు జిల్లా కార్యదర్శి పాండురంగ, ఫౌండర్ మల్లికార్జున, హెచ్‌ఎంలు తిమ్మారెడ్డి, నారయణరెడ్డి, శ్రీనివాసులు, పుండరీకాక్ష సన్మానించారు. పీడీ ఆయూబ్‌ఖాన్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు మల్లికార్జున, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం స్థానిక రెండవ రోడ్డు స్టడీ పార్కులో రంగవల్లుల పోటీలు జరిగాయి. మొట్టమొదటిసారి పారిశుద్ధ్య కార్మికులకు డిస్కవర్ అనంతపురం వారు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సామాజిక సేవా కార్యకర్త ఏజీ అనిల్‌కుమార్ రెడ్డి, ఏజీ ప్రమీళమ్మ, , సీఐటీయూ నాయకులు నాగరాజు మాట్లాడుతూ.. సంక్రాంతి పర్వదినాల విశిష్టతను తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి పారిశుద్ధ్య కార్మికుల కోసం సంప్రదాయ ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆలోచింపజేసే విధంగా సందేశాత్మక రంగవల్లులను తీర్చిదిద్ది విజేతలుగా నిలిచిన వారికి గ్యాస్ స్టవ్, మిక్సీ, ఐరన్ బాక్సులను బహుమతులుగా అందించారు.

కమనీయం.. కల్యాణం

- ఘనంగా గోదాదేవి కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతాలు
- ముగిసిన తిరుప్పావై పాశురాలు



అలంకరణలో గోదారంగనాథుల విగ్రహాలు

అనంతపురం కల్చరల్: గత నెల రోజులుగా భక్తిశ్రద్ధలతో సాగిన తిరుప్పావై పాశురాల పఠనం భోగి పండుగ రాకతో ఘనంగా ముగిసింది. సోమవారం ఉదయం, సాయంత్రం వేర్వేరుగా పలు చోట్ల గోదా రంగనాథ స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా శ్రీవైష్ణవ సంఘం వారు తపోవనంలోని శ్రీక్షేత్రంలో మాజీ ప్రభుత్వ (ఎండోమెంట్) సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ నేతృత్వంలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని శ్రీరంగం, తిరుమల పుణ్యక్షేత్రాల పద్ధతుల్లో ప్రధాన అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం వందలాది మందితో శ్రీవైష్ణవ సమ్మేళనం జరిగింది. స్థానిక అశోక్ నగర్‌లోని రమా సమేత సత్యనారాయణ స్వామి, హరిహర దేవాలయంలో నాట్యాచార్యులు తిరుప్పావైని ముగించి గోదారంగనాథ స్వామి కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అమితంగా ఆకట్టుకున్నాయి. తీర్థప్రసాద వితరణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే సాయిట్రస్టు ఆధ్వర్యంలో అరవింద నగర్‌లోని శ్రీకృష్ణ మందిరం, మొదటి రోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఉదయం సత్యనారాయణ స్వామి వ్రతాలు, సాయంత్రం గోదాదేవి కల్యాణం ఘనంగా జరిగాయి.



అలంకరణలో వరాహ నరసింహ స్వామి



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు